క్యాట్-2023

గెలుపు వ్యూహం!

కార్పొరేట్ ప్రపంచంలో వివిధ సంస్థల సీఈఓల్లో చాలామంది ఐఐటీలు, ఐఐఎంలలో చదివిన పట్టభద్రులే కనిపిస్తారు. విజయవంతమవుతున్న చాలా అంకుర సంస్థల బాధ్యులు ఈ సంస్థల నేపథ్యం ఉన్నవారే. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐ.ఐ.ఎం.)ల్లో ఎంబీఏ చేస్తే పెద్ద మొత్తంలో వార్షిక వేతన ప్యాకేజ్‌లు పొందవచ్చు. ఈ సంస్థల్లో, టాప్ బిజినెస్ స్కూల్స్‌లో సీటు సాధించాలంటే గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు 'క్యాట్' (కామన్ అడ్మిషన్ టెస్ట్)లో అర్హత తప్పనిసరి. ఈ పరీక్ష నోటిఫికేషన్ విడుదలైన సందర్భంగా ముఖ్య వివరాలు, సన్నద్ధత మెలకువలు...

గత సంవత్సరం అన్ని ఐ.ఐ.ఎం.లలోని దాదాపు 5000 ఎంబీఏ సీట్ల కోసం 2.20 లక్షలమంది క్యాట్‌లో పోటీ పడ్డారు. ప్రవేశ విషయంలో సానుకూలత ఏమిటంటే- కొన్ని సంవత్సరాలుగా ఐ.ఐ.ఎం.లు 'తరగతి గదుల్లో వైవిధ్యం' కోసం సాధారణ డిగ్రీ విద్యార్థులైన బీకాం, బీఎస్సీ, ఛార్టర్డ్ అకౌంటెన్సీ చదివినవారికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. బీటెక్ చదివినవారి కన్నా పై గ్రూపు విద్యార్థులకు క్యాట్‌లో తక్కువ స్కోరు వచ్చినా అడ్మిషన్ అవకాశం ఉంటోంది!

క్యాట్‌లో అర్హత సాధించిన తర్వాత, ఐ.ఐ.ఎం.లు, బిజినెస్ స్కూల్స్ తదుపరి స్క్రీనింగ్ టెస్ట్స్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్ (రాత పరీక్ష), గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల్లో ప్రతిభ చూపిస్తే ప్రవేశం కల్పిస్తున్నాయి. కాబట్టి విద్యార్థులు క్యాట్ సన్నద్ధతతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా పెంపొందించుకొంటే ఐ.ఐ.ఎం.ల్లో ప్రవేశం పొందటం ఖాయం.

దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబర్ 13.
క్యాట్ తేదీ: నవంబర్ 26
ఫలితాలు: జనవరి రెండోవారం.
అర్హత: ఏదైనా డిగ్రీలో 50 శాతం మార్కులు (జనరల్, ఓబీసీ). 45 శాతం మార్కులు (ఎస్‌సీ, ఎస్‌టీ, డీఏ) ఫైనల్ ఇయర్ డిగ్రీ విద్యార్థులు కూడా అర్హులే.

పరీక్ష స్వరూపం (2022 క్యాట్ ప్రకారం)
1 **వెర్బల్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్:** 24 ప్రశ్నలు
2 **లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్ ప్రిటేషన్:** 20 ప్రశ్నలు
3 **క్వాంటిటేటివ్ ఎబిలిటీ:** 22 ప్రశ్నలు
మొత్తం ప్రశ్నలు: 66. **ఎంసీక్యూలు:** 49, **నాన్ ఎంసీక్యూలు:** 17 (వీటికి నెగిటివ్ మార్కింగ్ లేదు).
కాల వ్యవధి : 2 గంటలు (ప్రతి విభాగానికీ 40 నిముషాలు)
ఒక్కో ప్రశ్నకు 3 మార్కులు. ప్రతి తప్పు సమాధానానికీ 1 మార్కు కోల్పోతారు.

క్యాట్‌తో పాటు జాట్ (జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్), స్నాప్ (సింబయాసిస్ నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్) లాంటి చాలా ప్రవేశపరీక్షల్లో దాదాపుగా ఇదే సిలబస్ కామన్‌గా ఉంటుంది. అందుకే క్యాట్ సన్నద్ధత అన్ని బీ స్కూల్స్ ప్రవేశ పరీక్షలకూ ఉపయోగకరం.

సబ్జెక్టుల వారీగా...

వెర్బల్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్ (వీఏ ఆర్‌సీ)

నాలుగు ప్యాసేజీలు (16 ప్రశ్నలు), వెర్బల్ ఎబిలిటీపై 8 ప్రశ్నలు (పేరా జంబుల్స్- 3, పేరా సమ్మరీ-3, పేరా కంప్లీషన్-2 ఉంటాయి. ప్రతి అభ్యర్థికీ కష్టంగా అనిపించే విభాగమిది. ఎందుకంటే మిగతా విభాగాలైన మ్యాథ్స్‌కూ, రీజనింగ్‌కూ ఉండే షార్ట్ కట్స్ దీనికి ఉండవు. అయితే ఇంగ్లిష్‌ను తార్కికంగా చదివితే సులభంగా విజయం సాధించవచ్చు. ఎక్కువ వెయిటేజీ రీడింగ్ కాంప్రహెన్షన్ (ఆర్‌సీ)కి ఉంది. 19 ప్రశ్నలు కేవలం ప్యాసేజ్‌లపైనే అడిగారు. అభ్యర్థులు తప్పనిసరిగా రీడింగ్ నైపుణ్యాలు పెంపెందించుకోవాలి. అంటే సాధారణ పఠనం కాకుండా, తార్కికమైన పఠనం చెయ్యాలి.

ప్రతి పోటీ పరీక్షలో ఆర్‌సీ రెండు విభాగాలతో కూడి ఉంటుంది- ఒకటి ప్యాసేజీ, రెండోది దాని ప్రశ్నలు, ఛాయిస్‌లు. ఎగ్జామినర్ ప్యాసేజీలను దినపత్రికలు, పుస్తకాల నుంచి సేకరించి పరీక్షలకు ఉపయోగిస్తారు. అంటే ప్యాసేజీలు కష్టతరంగా ఉండనప్పటికీ.. వాటి ప్రశ్నలు, ఛాయిస్‌ల భాగంలోనే ఉచ్చులు (ట్రాప్స్) ఉంటాయి. ఇక్కడ కొద్దిగా సమయం వెచ్చించి జాగ్రత్తగా చదవాలి/ ఛేదించాలి. చాలా సందర్భాల్లో అభ్యర్థులు ప్యాసేజీని పదే పదే చదువుతూ సమయం వృథా చేస్తుంటారు. దీన్నుంచి బయటపడాలి. అలాగే ప్యాసేజీని చదివేటప్పుడు, ప్రతి పేరాలోని ముఖ్య భావనలు వెలికితీయాలి. అంతేకానీ ప్రతి పదానికీ అర్థం కోసం వెతకకూడదు. ప్రశ్నలు పేరాలోని ముఖ్య భావనలపైనే కానీ, పదాలపై ఉండవు.

ఆర్‌సీ ప్రశ్నలు రెండు రకాలు. ఫ్యాక్ట్ (వాస్తవ సమాచార) ఆధారిత ప్రశ్నలు. ఇవి సులువైనవి. ప్యాసేజీల్లో వెతికితే జవాబులు దొరుకుతాయి. అయితే రెండో రకం ఇన్ఫరెన్స్ ప్రశ్నలు. వీటి జవాబులు పైపైన చదివితే దొరకవు. అంతర్లీనంగా /నర్మగర్భంగా ఉంటాయి. ఇక్కడ నిశిత పఠనం అవసరం. క్యాట్‌లో ఈ తరహా ప్రశ్నలు ఎక్కువగా ఇస్తుంటారు. ఈ విభాగంలో సమయపాలన చాలా అవసరం. ఎందుకంటే 40 నిమిషాల్లో 4 ప్యాసేజీలు, వెర్బల్ ఎబిలిటీ (వీఏ) విభాగం పూర్తి చెయ్యాలి. అంటే ఒక్కో ప్యాసేజీని 10 నిమిషాల్లోపే పూర్తిచేసి మిగతా సమయాన్ని వీఏకి ఉపయోగించుకోవాలి. మొత్తం మీద అభ్యర్థులు వేగంగా చదవటం అలవర్చుకోవాలి. క్యాట్‌లో ఆర్‌సీలు ఆన్‌లైన్‌లోని అంతర్జాతీయ దినపత్రికలు, మ్యాగజీన్స్ (ద గార్డియన్, ద న్యూయార్క్ టైమ్స్..)లో వచ్చే ప్రత్యేక వార్తలు, సంపాదకీయాల నుంచి ఇస్తుంటారు. ఫిలాసఫీ, సైన్స్, ఆర్థిక నేపథ్యమున్న కథనాలు ప్రతిరోజూ క్రమం తప్పకుండా చదవాలి. నిత్యం కొన్ని కొత్త ఆంగ్ల పదాలను నేర్చుకొంటూ పదజాలం పెంపొందించుకోవాలి. ప్యాసేజీలను చదువుతున్నపుడు కొత్త పదాలు ఎదురైతే సందర్భానికి అనుగుణంగా అర్థం చేసుకోగలగాలి. ఈ ఆర్‌సీ సాధన ద్వారా వీఏని సులభంగా ఛేదించవచ్చు. దీనికి ప్రత్యేక సాధన అవసరం ఉండదు. ఈవిధంగా రోజూ ఇంగ్లిష్ ఆర్‌సీల సాధన, అంతర్జాతీయ వార్తాపత్రికల పఠనం, కొత్త పదాలను నేర్చుకోవడం ద్వారా వీఏ ఆర్‌సీ విభాగంలో మంచి స్కోరు సాధించవచ్చు.

లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్ (ఎల్‌ఆర్ డీఐ)



దీనిలో ఎల్‌ఆర్‌పై 10 ప్రశ్నలు, డీఐపై 10 ప్రశ్నలు ఇస్తున్నారు. వీటిలో బార్ గ్రాఫ్‌లు, కాలమ్ గ్రాఫ్‌లు, టేబుల్ ఆధారిత ప్రశ్నలు, లైన్ చార్టులు, పై చార్టులు అడుగుతారు. పోయిన సంవత్సరం 'యూనివర్సిటీ టీం, మెట్రో లైన్స్, 15 గర్ల్స్' అనే టాపిక్స్‌పై ఎల్‌ఆర్ డీఐ ప్రశ్నలు తయారు చేశారు. నంబర్స్ ఆధారిత, వెన్ డయాగ్రమ్ లాంటి ఎల్‌ఆర్ ప్రశ్నలు అడుగుతున్నారు. ఈ విభాగంపై పట్టు రావాలంటే మొదటగా అరిథ్‌మెటిక్ సబ్జెక్టు, సెట్ థియరీపై అవగాహన రావాలి. సాధారణమైన లాజికల్ థింకింగ్ సామర్థ్యాలు పెంచుకోవడానికి సుడోకు లాంటి పజిల్స్ సాధన చెయ్యగలిగితే ఎల్‌ఆర్ డీఐపై పట్టు సాధ్యమవుతుంది.

క్వాంటిటేటివ్ ఎబిలిటీ (క్యూఏ)

2022 క్యాట్‌లో అరిథ్‌మెటిక్-8, ఆల్‌జీబ్రా-8, జామెట్రీ-3, నంబర్ సిస్టం-1, మోడర్న్ మ్యాథ్స్-2 ప్రశ్నలు అడిగారు. అరిథ్‌మెటిక్‌లో నంబర్ సిస్టమ్, శాతాలు, నిష్పత్తులు, సరాసరి, సమయం, వేగం-దూరం, బారు-చక్రవడ్డీ, పైప్స్, సిస్టెర్న్స్ లాంటి అంశాలనుంచి ప్రశ్నలు వస్తాయి. క్యూఏలో విజయం కోసం 8 నుంచి 10వ తరగతి మ్యాథ్స్ ప్రాథమిక అంశాల అధ్యయనం, అనువర్తనం చెయ్యాలి. సూత్రాలను బట్టీ పట్టకుండా తార్కిక పరిజ్ఞానం ఉపయోగించి ప్రశ్నలకు జవాబులు కనుగొనాలి. ఒక సౌలభ్యం ఏంటంటే- క్యాట్‌లో ఆన్‌స్క్రీన్ కాల్‌క్యులేటర్ ఉంటుంది. నాన్-మ్యాథ్స్ అభ్యర్థులు భయపడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే దాదాపు సగం ప్రశ్నలు మ్యాథ్స్‌పై కాకుండా నిత్యజీవితంలో ఉపయోగించే అరిథ్‌మెటిక్ నుంచే ఇస్తున్నారు.

సగం ప్రశ్నలకు సరైన జవాబులు రాస్తే చాలు

చాలామంది క్యాట్‌ను 'డిఫికల్ట్' పరీక్ష అని భావిస్తుంటారు. కానీ ఇది వాస్తవానికి 'డిఫరెంట్' పరీక్ష మాత్రమే. ఎందుకంటే మొత్తం 66 ప్రశ్నల్లో సగం (33) సరైన జవాబులు ఇవ్వగలిగినవారికి 99 పర్సంటైల్ స్కోరు వస్తుంది. ఈ టాప్ స్కోరు అన్ని టాప్ ఐ.ఐ.ఎం.లలో ప్రవేశానికి ఉపయోగపడుతుంది. 90 పర్సంటైల్ (20 ప్రశ్నలకు సరైన సమాధానాలు) సాధించినా అనేక ఐ.ఐ.ఎం.లలో అర్హత సాధిస్తారు. అంటే క్యాట్‌లో మంచి స్కోరుకు- అభ్యర్థి తన శక్తికి తగ్గ ప్రశ్నలను ఎంపిక చేసుకోవడం చాలా అవసరం. అసాధ్యమైన క్లిష్ట ప్రశ్నలను వదిలివేసే (ఎలిమినేషన్) సమయస్ఫూర్తి కూడా కావాలి. ఉన్న 2 గంటల సమయంలో తన సామర్థ్యానికి తగ్గ ప్రశ్నలను ఎంపిక చేసుకొని ఛేదిస్తే చాలు!

ముఖ్యంగా క్యాట్‌లో విజయానికి దోహదపడేది- ఆన్‌లైన్ మాక్ టెస్టుల సాధన. పరీక్ష లోపు కనీసం 50 మాక్స్ రాయాలి. రాసినవాటిలో తప్పులు ఎందుకు పోతున్నాయో విశ్లేషించి గ్రహించాలి. తద్వారా క్రమేణా స్కోరు మెరుగుపడుతుంది. మాక్ టెస్టుల్లో భాగంగా గత ప్రశ్నపత్రాలను కూడా సాధన చేయాలి. ఈవిధంగా పరీక్షపై పూర్తి అవగాహనతో ప్రణాళికాబద్ధంగా సన్నద్ధమవటం, ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయటం.. ఇవి చేస్తే క్యాట్‌లో మంచి స్కోరు సులువుగా సాధించవచ్చు!

- శ్రీధర్, డైరెక్టర్, కౌటిల్య, తిరుపతి

నియామక పరీక్ష ఏదీ రాయనవసరం లేకుండా... పదో తరగతి మార్కుల ప్రతిభతోనే ప్రభుత్వ ఉద్యోగం చేసుకునే అవకాశం వచ్చింది. గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్) ప్రకటన వెలువడింది. దేశవ్యాప్తంగా 30041 ఖాళీలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 1058, తెలంగాణలో 961 పోస్టులు భర్తీ చేస్తారు. అవకాశం వచ్చినవారు బ్రాంచి పోస్టు మాస్టర్, అసిస్టెంట్ బ్రాంచి పోస్టు మాస్టర్, డాక్ సేవక్ హోదాలతో విధులు నిర్వర్తించవచ్చు. పోస్టును బట్టి సుమారు రూ.15,000 నుంచి రూ.20,000 వేతనం పొందవచ్చు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

టెన్త్ మార్కులతో.. తపాలా కొలువులు

ఏపీలో 1058, తెలంగాణలో 961 ఖాళీలు

జీడీఎస్ ప్రకటన ఈ సంవత్సరం మేలో వెలువడింది. అప్పుడు దరఖాస్తు చేసుకున్నవారు అదే రిజిస్టర్ నంబర్ నమోదు చేసుకోవచ్చు. కొత్తగా వివరాలు నింపాల్సిన అవసరం లేదు. ఈ పోస్టుల్లో చేరినవారికి మూలవేతనం (బేసిక్ పే)తో పాటు కరవు భత్యం (డియర్‌నెస్ అలవెన్సు)ను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా చెల్లిస్తున్నారు. ప్రస్తుతం కేంద్రంలో 42 శాతం డీఏ అమలవుతోంది. దీని ప్రకారం-

- బ్రాంచి పోస్టు మాస్టర్ (బీపీఎం)కు రూ.12,000 మూలవేతనంతోపాటు ఇందులో 42 శాతం అంటే రూ.5040 డీఏ కూడా దక్కుతుంది. అంటే మొదటి నెల నుంచే వీరు రూ.17040 వేతనం అందుకోవచ్చు. దీంతోపాటు ఇతర ప్రోత్సాహకాలూ ఉంటాయి. ప్రతి ఆరు నెలలకు ఒక డీఏ, ఏటా ఇంక్రిమెంట్ వేతనంలో కలుస్తుంది.
- అసిస్టెంట్ బ్రాంచి పోస్టు మాస్టర్ (ఏబీపీఎం), డాక్ సేవక్‌లకు రూ.పదివేల మూలవేతనంతోపాటు రూ.4200 డీఏ దక్కుతుంది. వీరు విధుల్లో చేరిన మొదటి నెల నుంచి రూ.14,200 వేతనం, ఇతర ప్రోత్సాహకాలు పొందవచ్చు.

వీటితోపాటు ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంకుకు సంబంధించిన సేవలకు ప్రత్యేకంగా ఇన్సెంటివ్ రూపంలో బీపీఎం/ఏబీపీఎం/డాక్ సేవక్‌లకు ప్రోత్సాహం అందిస్తారు. ఆ సేవల విలువ ప్రకారం ఇన్సెంటివ్ చెల్లిస్తారు. స్వల్పమొత్తంలో హెచ్‌ఆర్‌ఏ కూడా దక్కుతుంది. వీరు రోజువారీ విధులు నిర్వర్తించడానికి ల్యాప్‌టాప్/కంప్యూటర్/స్మార్ట్‌ఫోన్ లాంటివి పోస్టల్ శాఖ సమకూరుస్తుంది. సంబంధిత కార్యాలయానికి అందుబాటులో నివాసం ఉండాలి. సైకిల్ తొక్కడం రావాలి. ఈ పోస్టుల్లో అవకాశం వచ్చినవారు రోజుకు సుమారు నాలుగైదు గంటలు పనిచేస్తే సరిపోతుంది.

విధులిలా..

- **బ్రాంచి పోస్టు మాస్టర్ (బీపీఎం):**
  వీరు బ్రాంచి కార్యకలాపాలు పర్యవేక్షించాలి. పోస్టల్ విధులతోపాటు ఇండియా పోస్టు పేమెంట్ బ్యాంకు వ్యవహారాలూ చూసుకోవాలి. రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ లావాదేవీలు, రోజువారీ కార్యకలాపాలు సజావుగా సాగేలా, ఉత్తరాలు పంపిణీ జరిగేలా పర్యవేక్షించాలి. పోస్టల్‌కు సంబంధించిన మార్కెటింగ్ వ్యవహారాలూ చక్కబెట్టాలి. బృంద నాయకుడిగా సంబంధిత బ్రాంచిని నడిపించాలి. పోస్టల్ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి.
- **అసిస్టెంట్ బ్రాంచి పోస్టు మాస్టర్ (ఏబీపీఎం):**
  ఈ విధులు నిర్వర్తించేవాళ్లు స్టాంపులు/స్టేషనరీ అమ్మకం, ఉత్తరాలు పంపిణీ, ఇండియన్ పోస్టు పేమెంట్స్ బ్యాంకుకు సంబంధించిన డిపాజిట్లు, పేమెంట్లు, పోస్టల్‌కు సంబంధించిన ఇతర వ్యవహారాలు చక్కబెట్టాలి. బ్రాంచి పోస్టు మాస్టర్ సూచించిన విధులు నిర్వర్తించాలి. తపాలా పథకాల గురించి ప్రజల్లో అవగాహన కలిగించాలి.
- **డాక్ సేవక్:**
  వీరు ముఖ్యంగా ఉత్తరాలు పంపిణీ చేయాలి. అలాగే స్టాంపులు/ స్టేషనరీ అమ్మకాల బాధ్యత వీరిదే. బీపీఎం, ఏబీపీఎం సూచించిన విధులు పూర్తిచేయాలి. రైల్వే మెయిల్ సర్వీస్, పోస్టల్ పేమెంట్ బ్యాంకు వ్యవహారాలూ చక్కబెట్టాలి.

ఎంపిక
అభ్యర్థులు పదో తరగతిలో సాధించిన మార్కుల మెరిట్‌తో నియామకాలుంటాయి. ప్రకటనలో ఖాళీలు ఉన్న బ్రాంచీలు, ఏ హోదాలో ఖాళీ ఉంది, రిజర్వ్‌డ్/ అన్ రిజర్వ్‌డ్ వివరాలు పేర్కొన్నారు. వాటిని అభ్యర్థులు పరిశీలించి, తమ ప్రాధాన్యం ప్రకారం ఆప్షన్లు ఇవ్వాలి. మొదటి ప్రాధాన్యం ఇస్తోన్నదానికి ఆప్షన్-1 తర్వాత దానికి ఆప్షన్-2...ఇలా నింపాలి. అవకాశాన్ని బట్టి వీటిలో ఏదో ఒకచోట పోస్టింగ్ కేటాయిస్తారు. ఎంపికైనవారికి సమాచారం ఎస్ఎంఎస్/ఈమెయిల్/పోస్టు ద్వారా అందుతుంది.

కటాఫ్
గత నోటిఫికేషన్ (మే, 2023)లో ఏపీలో 118, తెలంగాణలో 96 ఖాళీలకు గానూ జనరల్, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ.. ఇలా అన్ని విభాగాల్లోనూ పదో తరగతిలో వంద శాతం మార్కులు పొందినవారికే అవకాశం దక్కింది. పోస్టుల సంఖ్య తక్కువగా ఉండటమే దీనికి కారణం. అంతకు ముందు మాత్రం జనరల్, ఓబీసీ విభాగాల్లో సుమారు 95 శాతం, ఎస్సీ, ఎస్టీలైతే 93 శాతం మార్కులు పొందినవారికి అవకాశం దక్కింది. ఈసారి పోస్టులు ఎక్కువగా ఉన్నాయి కాబట్టి జనరల్, ఓబీసీలైతే 96, ఎస్సీ, ఎస్టీలు 94 శాతం మార్కులు పొందితే అవకాశం దక్కవచ్చు.

ముఖ్య వివరాలు
అర్హత: పదో తరగతి ఉత్తీర్ణత. ఇందులో మ్యాథ్స్, ఇంగ్లిష్, స్థానిక భాష ఉండటం తప్పనిసరి. అంటే ఏపీ, తెలంగాణకు చెందినవారు తెలుగు సబ్జెక్టు పదో తరగతి వరకు చదవాలి.
వయసు: ఆగస్టు 23, 2023 నాటికి 18-40 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు వర్తిస్తుంది.
ఫీజు: మహిళలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, ఎస్సీ, ఎస్టీలకు లేదు. మిగిలినవారంతా రూ.వంద చెల్లించాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 23
వెబ్‌సైట్: https://indiapostgdsonline.gov.in/

దూరవిద్యలో ఎంబీఏ ఎక్కడ?



బీటెక్ (కెమికల్ ఇంజినీరింగ్) చేసి కెమికల్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నా. కెరియర్ మారాలనుకుంటున్నాను. పని చేస్తూనే ఏపీ నుంచి దూరవిద్యలో ఎంబీఏ (హెచ్‌ఆర్) చేయాలంటే ఎక్కడ మేలు? – ఎ.శ్రీహరి

● మీరు దూరవిద్యలో ఎంబీఏ చేయాలనుకొంటే ఆంధ్రప్రదేశ్ నుంచే చేయాల్సిన అవసరం లేదు. ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్శిటీ ద్వారా చేస్తే మీ డిగ్రీకి ఎక్కువ గుర్తింపు ఉండే అవకాశం ఉంది. పాండిచ్చేరి యూనివర్సిటీ దూరవిద్య ద్వారా కూడా ఎంబీఏ చదవొచ్చు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, హైదరాబాద్ నుంచీ చదివే అవకాశం ఉంది. ఇవే కాకుండా సాంప్రదాయిక విశ్వవిద్యాలయాలైన ఆంధ్రా యూనివర్సిటీ, శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీల్లో కూడా దూరవిద్య ద్వారా ఎంబీఏ చేయొచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రైవేటు డీమ్డ్ టు బీ వర్సిటీల్లో ఆన్‌లైన్ విధానంలో ఎంబీఏ చేయొచ్చు. వీటితో పాటు ఇతర రాష్ట్రాల ప్రముఖ ప్రైవేటు/డీమ్డ్ టు బీ వర్సిటీలు ఎంబీఏని ఆన్‌లైన్ విధానంలో అందిస్తున్నాయి. కోర్సును, యూనివర్సిటీని ఎంచుకొనేముందు ఆ కోర్సుకు యూజీసీ, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో అనుమతులు, ఏఐసీటీఈ గుర్తింపు, ఆ వర్సిటీకి న్యాక్ గ్రేడింగ్ ఏ/ఏ ప్లస్/ఏ ప్లస్ ప్లస్ ఉన్నాయో, లేదో తెలుసుకోండి. సాధారణంగా ఎంబీఏలో ప్రవేశం పొందాలంటే ఆ యూనివర్సిటీ నిర్వహించే ప్రవేశపరీక్ష కానీ, రాష్ట్రస్థాయి ఐసెట్ కానీ రాయవలసి ఉంటుంది. **– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్,** కెరియర్ కౌన్సెలర్

నోటిఫికేషన్స్

ప్రభుత్వ ఉద్యోగాలు

ఐపీపీబీలో ఎగ్జిక్యూటివ్ పోస్టులు
న్యూఢిల్లీలోని ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఐపీపీబీ).. ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
- **ఎగ్జిక్యూటివ్:** 132 పోస్టులు (యూఆర్- 56, ఈడబ్ల్యూఎస్- 13, ఓబీసీ- 35, ఎస్సీ- 19, ఎస్టీ- 9)

అర్హత: ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్
జీతభత్యాలు: నెలకు రూ.30,000.
ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్/ గ్రూప్ డిస్కషన్/ పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు రుసుము: రూ.300. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.100.
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 16.08.2023.
వెబ్‌సైట్: https://www.ippbonline.com/

కాటన్ కార్పొరేషన్‌లో ఎగ్జిక్యూటివ్ ఖాళీలు
నవీ ముంబయిలోని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్.. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
- **మొత్తం ఖాళీలు:** 93
- **మేనేజ్‌మెంట్ ట్రైనీ (మార్కెటింగ్):** 06
- **మేనేజ్‌మెంట్ ట్రైనీ (అకౌంట్స్):** 06
- **జూనియర్ కమర్షియల్ ఎగ్జిక్యూటివ్:** 81

అర్హత: సంబంధిత విభాగాల్లో డిగ్రీ, పీజీ, సీఏ/ సీఎంఏ.
వయసు: 30 సంవత్సరాలు మించకూడదు.
జీత భత్యాలు: నెలకు మేనేజ్‌మెంట్ ట్రైనీకి రూ.30,000- 1,20,000; జూనియర్ కమర్షియల్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు రూ.22000-90000.
ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా.
దరఖాస్తు రుసుము: రూ.1500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు రూ.500.
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: 13.08.2023.
వెబ్‌సైట్: https://cotcorp.org.in/?AspxAutoDetectCookieSupport=1

మొయిల్ లిమిటెడ్‌లో గ్రాడ్యుయేట్ ట్రైనీలు
నాగ్‌పుర్‌లోని మొయిల్ లిమిటెడ్ (మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్).. వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్ ట్రైనీ, మేనేజర్ ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 21.
- **గ్రాడ్యుయేట్ ట్రైనీ (మైన్స్):** 15
- **గ్రాడ్యుయేట్ ట్రైనీ (మెకానికల్):** 04
- **మేనేజర్ (సర్వే):** 02

అర్హతలు: డిప్లొమా (మైనింగ్ అండ్ మైన్ సర్వేయింగ్/ సివిల్ ఇంజినీరింగ్), సర్వేయర్స్ సర్టిఫికెట్ ఆఫ్ కాంపిటెన్సీ, బీఈ, బీటెక్ (మైనింగ్/ మెకానికల్).
వయసు: 15.08.2023 నాటికి గ్రాడ్యుయేట్ ట్రైనీలకు 30 ఏళ్లు, మేనేజర్ పోస్టుకు 35 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా.
దరఖాస్తు రుసుము: రూ.590. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు ఫీజు మినహాయింపు ఉంటుంది.
వెబ్‌సైట్: https://www.moil.nic.in/

యూపీఎస్సీ 56 పోస్టులు
యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) 56 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టులు: ఏరోనాటికల్ ఆఫీసర్, ప్రిన్సిపల్ సివిల్ హైడ్రోగ్రాఫిక్ ఆఫీసర్, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ తదితరాలు.
విభాగాలు: ఏరోనాటికల్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ మెకానికల్/ మెటలర్జికల్ తదితరాలు.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో డిగ్రీ/ పీజీ.
వయసు: 35-40 ఏళ్లు ఉండాలి.
ఎంపిక: షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 10.08.2023.
వెబ్‌సైట్: https://www.upsc.gov.in/



వాక్‌ఇన్

ఈఎస్ఐసీ-కర్ణాటకలో సీనియర్ రెసిడెంట్‌లు
కర్ణాటకలోని ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **మొత్తం ఖాళీలు:** 45

పోస్టులు: సీనియర్ రెసిడెంట్లు.
విభాగాలు: అనాటమీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, ఫొరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్, డెర్మటాలజీ, సైకియాట్రీ, పాథాలజీ తదితరాలు.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో పీజీ డిగ్రీ/ ఎండీ/ ఎంఎస్/ డీఎన్‌బీ.
వయసు: 44 ఏళ్లు ఉండాలి.
ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా.
ఇంటర్వ్యూ వేదిక: ESIC Medical College and Hospital, Kalaburagi.
దరఖాస్తు ఫీజు: 300.
ఇంటర్వ్యూ: 09.08.2023 (ఉదయం 9-10:30 వరకు).
వెబ్‌సైట్: www.esic.gov.in/regional-offices/12/Karnataka

తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్ ఫ్రమ్ హోమ్

బ్రాండ్ డిజైన్
సంస్థ: డెల్టా 4 కామర్స్
స్టైపెండ్: నెలకు రూ.6,500-8,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 18
అర్హతలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ఫిగ్మా, స్కెచింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/334f90

బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)
సంస్థ: టెక్ ఎనాలజీ
స్టైపెండ్: నెలకు రూ.1,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 18
అర్హతలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, గూగుల్ సూట్, గూగుల్